


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



\- 125 –

## శిక్ష

**కువైట్ దేశంలో** ఆల్కహాల్ నిషేధించబడినది. క్లబ్బులు, పబ్బులు వుండవు. స్త్రీలకు రక్షణ వుంటుంది. నేరం చెయ్యాలంటే భయపడతారు. చట్టాన్ని గౌరవిస్తారు. అందుకే నేను ఇండియా తర్వాత కువైట్ నూ ఇష్టపడతాను.

డ్రగ్స్ దొరికితే శిక్షలు కఠినంగా వుంటాయి. మత్తుపదార్థాలు వాడినా, అమ్మినా, రేప్ చేసినా.. నేరస్థులకు వెంటనే ఉరిశిక్షలు అమలు చేయబడతాయి.

2003 లో అనుకుంటాను. ముగ్గుర్ని ఎత్తయిన స్థలంలో కొయ్యలకు కట్టి ఉరి తియ్యడం కళ్ళారా చూసాను.

నైఫ్ ప్యాలస్ లో ఉరి తీసే స్థలం వుంది. ఆ ప్రాంగణం నేను పని చేసే మారియట్ 5 స్టార్ హోటల్ కు పక్కనే వుండేది. 12 వ అంతస్తులో నా ఆఫీసు వుండేది. అక్కడి కిటికీలోనుండి చూస్తే స్పష్టంగా ఆ దృశ్యం కనపడింది.

భయానకమైన ఘటనలను చూడకూడదు, చూసేంత ధైర్యం, శక్తి లేవు, తట్టుకోలేను అనుకుంటూనే హృదయాన్ని గట్టి చేసుకుని చూసాను.

నరరూప రాక్షసులైన వారికి తగిన శిక్ష పడిందన్న తృప్తి, తరువాత ఇలాంటి ఘోరాలు ఎందుకు జరుగుతున్నాయి అనే ప్రశ్న, బాధ, ఆవేదన, కలవరం నా మనసును పట్టి పీడించాయి.

మూడు శరీరాలు ఉరికొయ్యలకు వ్రేలాడుతూ గిలగిలా కొట్టుకున్న ఆ దృశ్యం చాలాకాలం నన్ను వెంబడించింది.

ఇప్పటికీ సజీవంగా కళ్ళముందు మెదులుతోంది.

వారిలో ఒకడు రేపిస్ట్. ఒకడు హత్య చేసాడు. ఇంకొకడు డ్రగ్స్ అమ్మాడు. కానీ ఇప్పుడు ముఖ్యంగా హవాలీ మాన్ స్టర్ అనబడే ఆ రేపిస్ట్ గురించి చెప్పబోతున్నాను.

దుర్మార్గుడికి తగిన శిక్ష పడింది అనేవాళ్ళు కొందరైతే.. కువైట్ దేశంలో ఇంత ఘోరం చేయడానికి వాడికెంత ధైర్యం? వాడు మనిషి కాదు నరరూప రాక్షసుడు అని వ్యాఖ్యానించే వాళ్ళు కొందరు.

ఏ దేశంలో అయినా దొంగలు, హంతకులు, నేరస్తులు ఎక్కువగా వున్నారు, తయారవుతున్నారు అంటే అది ఆ దేశ దౌర్భాగ్యమే. వ్యవస్థ వైఫల్యమే.

కానీ శాంతి సౌభాగ్యాలకు చిహ్నం, అతి చిన్న దేశమయినా కూడా ధనిక దేశమయిన కువైట్ లో ఇంత పెద్ద నేరం చేసిన ఆ దుర్మార్గుడి ధైర్యానికి ప్రజలు విస్తుపోయారు.

రెండొంతులమంది మాత్రమే స్థానికులయిన అరబ్బులు, మిగతా మూడొంతులమంది విదేశీయులు నివసించే కువైట్ దేశంలో పరదేశులు భయభక్తులతో పనులు చేసుకుని సామరస్యంగా జీవిస్తారు.

కులాలు, మతాలు, దేశాలు, భాషల కతీతంగా పొట్టకూటికోసం వేరే దేశానికి వచ్చామన్న సంగతిని గుర్తుంచుకుని మెలుగుతుంటారు.

అలాంటిది సంచలనం సృష్టించిన ఈ ఘోరకలితో కువైట్ దేశం ఉలిక్కిపడింది.

ఇది నమ్మశక్యం కాని విషయమయింది.

ఆ నరరూప రాక్షసుడి పేరు హజాజ్ సాది. వాడి వయసు ముప్పైమూడేళ్ళు. ఈజిప్ట్ దేశంలోని లక్సర్ పట్టణం నుండి కువైట్ దేశానికి వచ్చి సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. వాడికి పిల్లలే టార్గెట్. అది కూడా పదేళ్ళ లోపల వయసున్నవాళ్ళు. వీడి చేతిలో బలయిన పిల్లల్లో అబ్బాయిలే ఎక్కువున్నారు.

రాక్షసత్వం, కళ్ళు నిండిన కామంతో వాడు ఈ దుర్మార్గానికి పాల్పడ్డాడు. ఒకరు కాదు ఇద్దరు కాదు. ఏకంగా పదిహేడు మంది పిల్లల్ని వాడు మాయ మాటలు చెప్పి బిల్డింగ్ పైనున్న టెర్రెస్ మీదికి తీసుకెళ్ళి వాడి కామాన్ని తీర్చుకునేవాడు. ఈ క్రమంలో పిల్లల్ని హింసించేవాడు. ప్రతిఘటించే పిల్లలను బెదిరించేవాడు. కనికరం అనే మాటకు అర్థమే లేదు. మానవత్వం అనేది వాడి డిక్షనరీలోనే లేదు. తల్లిదండ్రులకే కాదు ఎవరికి చెప్పినా చంపేస్తానని బెదిరించేవాడు.

పాపం పసిపిల్లలు వాడి హింసను సహిస్తూ భయపడిపోయి కడుపునొప్పి అనీ, కాళ్ళునొప్పులనీ, జ్వరమనీ చెప్పి పడుకునే వాళ్ళు. తల్లిదండ్రులు కూడా ఆ విధంగా అనుమానించక పిల్లలకు ఆరోగ్యం బాలేదని భావించేవారు. నాల్రోజులు ఏవో మందులు వేసేవారు.

వాడు ఎంపిక చేసుకున్న పిల్లలు ముఖ్యంగా జోర్డాన్, సిరియా, లెబనాన్, ఈజిప్ట్, ఇరాన్, మొరాకో, లిబియా దేశాల నుండి వచ్చిన పరదేశులు. తల్లిదండ్రులు ఉదయాన్నే లేచి పిల్లలను స్కూల్ కు పంపించి పనులకు వెళ్ళిపోతారు.

వీడు ఆ బిల్డింగుకు కాపలాగా వుండేవాడు కాబట్టి అందరితో పరిచయం వుండేది. లోనికి వచ్చేవాళ్ళు బయటికి పొయ్యేవాళ్ళు అందరూ వాడికి తెలియకుండా చెప్పకుండా వెళ్ళడానికి వీల్లేదు. అంతా వాడి పర్యవేక్షణలోనే జరిగేది.

స్కూల్ నుండి వచ్చిన పిల్లలు తల్లిదండ్రులు వచ్చేవరకు వాడి దగ్గరే కాలక్షేపం చేసేవారు. తల్లితండ్రులు కూడా సాదీ మా పిల్లల్ని మేము వచ్చేవరకూ కాసేపు చూసుకో అని అప్పజెప్పేవారు.

అరబ్బుల్లో ఒక ముఖ్యమైన విషయాన్ని గమనించాలి. వాళ్ళు ఆడపిల్లల్ని మగవాళ్ళకు అప్పగించరు. ఆడపిల్లల్ని వారితోపాటే వుంచుకుంటారు. లేదా బంధువులకో ఆడవాళ్ళకో అప్పగిస్తారు.

అందువలన ఇక్కడ మగపిల్లలే ఎక్కువగా సాది గదిలోకి వచ్చేవారు. ఈ క్రమంలో ఆ మృగాడు పిల్లలపై కన్నేసాడు. అలా 17 మందిని మార్చి మార్చి వాడుకుంటూ ఆ లేత దేహాలపై దాడి చేస్తూ కామం తీర్చుకునే వాడు. పసి పిల్లలపై క్రూరత్వాన్ని చూపి మృగంలా వారి మీదపడి టార్చర్ పెట్టేవాడు. పసి దేహాలకు నరకం చూపించేవాడు. వాడు కువైట్ లోని హవాలి అనే ప్రాంతంలో నివసిస్తూ వాడుండే బిల్డింగ్ పై భాగంలో నిర్మానుష్యంగా వుండటం చూసి ఈ దురాగతాలకు పాల్పడ్డాడు. వీడిని హవాలి మాన్ స్టర్ గా పిలిచారు. జనాలు అసహ్యించుకున్నారు. ఉమ్మి ఊసారు. తిట్టారు. వాడిని వదిలితే రాళ్ళతో కొట్టి చంపాలని కత్తికో కండగా నరికి ఎడారిలోని రాబందులకు విసిరి వేయాలని భావించారు.

వాడికి కొవ్వెక్కువ. పెళ్ళయి భార్యా, ఒక బిడ్డ ఈజిప్ట్ లో వున్నారు. డబ్బు సంపాదనకై కువైట్ దేశం వచ్చాడు వాడు. కామం కట్టలు తెంచుకుని వంట్లో ప్రవహిస్తుంటే వాడి కన్ను బడికి వెళ్ళే పిల్లలపై పడింది.

మామూలుగా కువైట్ కి వచ్చిన వాళ్ళు ఎవరో ఒకరి తోడును కలుపుకోవడం జరుగుతూ వుంటుంది..

కొందరు కాలక్షేపం కోసం, మరికొందరు ప్రేమ కోసం, ఇంకొందరు జీవితం కోసం మనిషితో సాంగత్యాన్ని కోరుకుంటారు.

ఇది సృష్టిలో సహజమైన ప్రక్రియ. దీన్ని స్త్రీపురుషుల మధ్య ఆకర్షణ లేదా ప్రేమ అని భావించవచ్చు.. కానీ ఈ ఉన్మాది కన్ను ముక్కుపచ్చలారని పిల్లలపై పడింది. ఇది సృష్టికి విరుద్ధమైనది. అసహజమైనది. అసహ్యమైనది. హేయమైనది.

కువైట్ చరిత్రలో సద్దాం హుస్సేన్ ఆక్రమణ ఒక చీకటి అధ్యాయమైతే ఈ సైకో వరుస రేపులు, కువైట్ కి చీకటి కోణాన్ని పరిచయం చేసాయి.

ఈ వార్త తెలిసిన అరబ్ ప్రపంచం నివ్వెరపోయింది. కంటికి కన్ను పంటికి పన్ను అనే కఠినమైన శిక్షలతో నేరమంటే భయం పుట్టేలా చేస్తారు అరబ్బులు. తప్పుచేస్తే చట్టాలు చాలా కఠినంగా వ్యవహరిస్తాయి.

అలాంటిది ఒక మస్రీ వాడు ఇంత ఘాతుకానికి ఒడి కట్టాడంటే ఈ విషయాన్ని కువైట్ దేశమే కాదు మొత్తం గల్ఫ్ దేశాలు జీర్ణించుకోలేక పోయాయి. దిగ్భ్రాంతి చెందాయి.

వాడికి డ్రైవింగ్ కూడా వచ్చు. లైసెన్స్ వుంది. అందుకే పార్ట్ టైం జాబ్ గా టేక్సి కూడా నడుపుకుంటాడు. ఆ రోజు ఎప్పటిలానే వాడు ఆ బిల్డింగ్ లో వున్న పిల్లల్ని స్కూల్ నుండి తీసుకొచ్చాడు.

కారు దిగాక అమర్ అనే జోర్డానియన్ పిల్లవాడి తల్లిదండ్రులు ఇంకా డ్యూటీ నుండి రాకపోవడంతో టివి చూద్దాం రమ్మని బేస్మెంట్ లో వున్న తన గదికి పిలిచాడు. ఆ పిల్లాడు అమాయకంగా వచ్చాడు.

కాసేపు మాట్లాడాక తనతోపాటూ టెర్రస్ మీదికి వస్తే చేక్లెట్స్ ఇస్తానని చెప్పి లిఫ్ట్ లో ఏడంతస్తుల భవనం పైకి తీసుకెళ్ళాడు. పాపం పసివాడు బలి కాబోతున్నానని తెలియక హుషారుగా నవ్వుకుంటూ వెళ్ళాడు.

కానీ ఆరోజు ఆ ఈజిప్ట్ వాడి టైం బాలేదు. వాడి దుర్మార్గాలకు తెర పడే సమయం ఆసన్నమయింది.

పిల్లవాడి తల్లి అప్పుడే ఆఫీస్ నుండి ఇంటికి వచ్చింది. అమర్ కోసం వెతుకుతూ వచ్చింది.

ఆమె బయటికి రావడం వీళ్ళు లిఫ్ట్ లో పైకి వెళ్ళడం ఒకేసారి జరిగింది.

వాళ్ళు పైకి వెళ్ళడం చూసిన ఆ జోర్డానియన్ మహిళ అదే లిఫ్ట్ కిందికి వచ్చాక ప్రతి ఫ్లోర్ ను వెతుక్కుంటూ ఆఖర్లో టెర్రేస్ పైకి వెళ్ళింది.

టెర్రేస్ పైకి లిఫ్ట్ వెళ్ళదు కాబట్టి ముందున్న ఫ్లోర్ లో దిగి మెట్ల మీదుగా పైకి చేరుకుంది. కానీ ఆమె "అమర్ ఓ.. అమర్" అని పిలుస్తూ వెళ్ళడంతో ఆ రాక్షసుడు అలర్ట్ అయ్యాడు.

అప్పటికే పిల్లాడి పరిస్థితి ఘోరంగా వుంది. వాడి కాళ్ళూ చేతులూ కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కాడు. బట్టలన్నీ ఊడతీసాడు. టెర్రెస్ పైన అన్నీ వాటర్ ట్యాంకులు వుండటంతో మూలకు వెళితే మనుషులు కనపడరు. ఏం జరుగుతుందో తెలిసే అవకాశం లేదు.

ఎప్పుడైతే జోర్డాన్ తల్లి కొడుకు కోసం వచ్చిందో వాడు పిల్లోడ్ని వదిలి పులిలా ఆమె మీదికి దూకాడు. ఆమె ఒక్కడుగు వెనక్కి వేసింది. వాడు బోర్లా పడ్డాడు. ఆమె నిర్ఘాంతపోయి గట్టిగా అరుస్తూ పడుతూ లేస్తూ అదే మెట్ల మీదుగా కిందకి పరిగెత్తింది. భయంతో వణుకుతూ కిందకి చేరుకుని అందర్నీ పిలిచి పైకి తీసుకొచ్చింది.

వాటర్ ట్యాంక్లకు వెనక అమర్ ను వాళ్ళు కనుగొన్నారు. అప్పటికే పిల్లాడి పరిస్థితి చాలా భయంకరంగా వుంది. వాళ్ళంతా తేరుకుని పోలీసులకు ఫోన్ చేసారు.

కానీ ఆ దుర్మార్గుడు ఎక్కడా కనపడలేదు. పోలీసులు వెతకడం ప్రారంభించారు. సాది కువైట్ పోలీసు వ్యవస్థను, చట్టాన్ని తక్కువగా అంచనా వేసాడు.

అతడు తన గుట్టు రట్టు అయిందని భావించి సరాసరి ఎయిర్పోర్టుకు వెళ్ళి లక్సర్ వెళ్ళే ఫ్లయిట్ కు టికెట్ కొని చెక్ ఇన్ అవడానికి ప్రయత్నిస్తున్నాడు. నరరూప రాక్షసుడైన వాడిని ఎయిర్పోర్టులో పట్టుకున్నారు.

తరువాత వాడు రేప్ చేసిన పిల్లల వివరాలన్నీ ఒక్కొక్కటి బయటికి వస్తుంటే పోలీసులే ఆశ్చర్యపోయారు. వాడిని జైలుకు తరలించారు. కువైట్ కోర్ట్ వాడిని మాన్ స్టర్ గా, కువైట్ చరిత్రలో మాయని మచ్చగా అభివర్ణిస్తూ ఐదుసార్లు ఉరి తీయడానికి అర్హుడని భావిస్తూ ఉరిశిక్ష విధించింది. నేరస్థులకు శిక్షలు కఠినంగా వుంటే మరోసారి నేరాలు చెయ్యరని గల్ఫ్ దేశాలు భావిస్తాయి. అరుదుగా జరిగే ఇలాంటి ఘటనలు తప్ప పరదేశులు కూడా భుక్తికోసం వచ్చామని గుర్తుంచుకుని భయంతో భక్తితో చట్టాన్ని గౌరవిస్తూ పని చేసుకుని జీవిస్తారు.

(మరోకథ వచ్చేనెల)

Post your comments